జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శుక్రవారం | 7-11-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 504 పేజీలు: 4 వెల : రూ.7

# పలాసలో కిడ్నాప్.. కలకలం



* వ్యాపారి రాజును కారులో బలవంతంగా తరలింపు
* ఆస్తుల గొడవలే కారణమంటున్న తోటి వ్యాపారులు
* పోలీసులకు ఫిర్యాదు చేసిన వ్యాపారి భార్య
* పోలీసుల హెచ్చరించడంతో విడిచిపెట్టిన కిడ్నాపర్లు
* తనపై భౌతికంగా దాడి చేశారన్న బాధితుడు

**పలాస, నవంబరు 6 (వార్త):** తన వద్ద తీసుకున్న అప్పును తీర్చకపోవడంతో.. అతని ఆస్తిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఓ వ్యక్తి అనుచరులతో చేసిన కిడ్నాప్ వ్యవహారం పలాసలో కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. పలాసకు చెందిన జీడి వ్యాపారి వి.లక్ష్మీనారాయణరాజు ఆమదాలవలసకు చెందిన వ్యాపారి పొట్నూరు వేణుగోపాలరావు వద్ద రూ.1.10కోట్లు అప్పు చేశాడు. లక్ష్మీనారాయణరాజుకు ఆమదాలవలసలో షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. దీన్ని వేణుకు అద్దెకు ఇచ్చాడు. అయితే వేణు తన అప్పు తీర్చాలని, లేకుంటే ఆ షాపింగ్ కాంప్లెక్స్‌ను తన పేరిట రాయాలని లక్ష్మీనారాయణరాజుపై ఒత్తిడి పెంచాడు. దీంతో వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో రాజు ఈ షాపింగ్ కాంప్లెక్స్‌ను అమ్మి, అప్పు తీర్చేందుకు సన్నద్ధమయ్యాడు. కాగా ఆ షాపింగ్ కాంప్లెక్స్‌ను తనకు తప్ప వేరే వ్యక్తులకు అమ్మకూడదని, అలా చేస్తే ఊరుకోనని వేణు హెచ్చరికలు చేసినట్టు తెలిసింది. అయినప్పటికీ వేరే వ్యక్తికి అమ్మకానికి చూపాడు. ఈ క్రమంలో వేణు ఆయన అనుచరులు.. లక్ష్మీనారాయణరాజును కిడ్నాప్ చేసి ఆమదాలవలసలో ఆ షాపింగ్ కాంప్లెక్స్ తన పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు పథకం వేశారు. దీనిలో భాగంగా గురువారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో కేటీ రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద టీ తాగుతున్న రాజును వేణు అనుచరులు బలవంతంగా కారులో ఎక్కించి కిడ్నాప్ చేశారు. రాజు వద్ద ఉన్న సెల్‌ఫోన్ తీసుకొని స్విచ్ఛాఫ్ చేశారు. అక్కడే ఉన్న కొందరు వ్యాపారులు ఈవిషయాన్ని రాజు భార్య మాధవికి సమాచారం అందించారు. దీంతో ఆమె కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. అయితే రాజుతో ఆయన భార్య మాధవికి ఫోన్ వేణు చేయించాడు. తాను క్షేమంగా ఉన్నానని, సాయంత్రానికి తిరిగి వస్తానని చెప్పించాడు. అయితే కాశీబుగ్గ పోలీసులు తిరిగి వేణుకు ఫోన్ చేసి హెచ్చరించడంతో రాజును నరసన్నపేట వద్ద కిడ్నాపర్లు విడిచిపెట్టేశారు. వేణు కాశీబుగ్గ పోలీస్టేషన్‌కు చేరుకొని కిడ్నాప్, రిజిస్ట్రేషన్ వ్యవహారాన్ని పోలీసులకు జరిగిన తంతుపై ఫిర్యాదు చేశాడు. తనపై భౌతికంగా దాడి కూడా చేశారని వాపోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు.

## సెప్టిక్ ట్యాంకులో దిగిన
# ఇద్దరికి అస్వస్థత

**కొత్తూరు, నవంబరు 6 (వార్త):** కొత్తూరు మండలంలోని నేతాజీనగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇంటి సెప్టిక్ ట్యాంకులో దిగిన ఇద్దరు వ్యక్తులు అస్వస్థతకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. సకాలంలో అక్కడికి చేరుకుని ఇద్దరికి స్థానిక ఆసుపత్రికి తరలించడంతో పెను ప్రమాదం తప్పింది. నేతాజీనగర్ కాలనీలో గుడ్ల వెంకట్రావు అనే వ్యక్తి ఇంటి నిర్మాణంలో భాగంగా సెప్టిక్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. ఆయనతోపాటు పి.సూర్యనారాయణ అనే మరో వ్యక్తి కూడా ట్యాంకు లోపల రంగులు వేసేందుకు దిగారు. ట్యాంకు లోపల ఆక్సిజన్ అందక అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. కొంతసేపటి తరువాత వారి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ అధికారి ఎన్.బుచ్చోడు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, వారిని బయటకు తీశారు. అపస్మారక స్థితికి చేరుకున్న ఇద్దరిని సీపీఆర్ చేశారు. అనంతరం కొత్తూరు సామాజిక ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

## విద్యుత్ స్తంభం పడి కార్మికుడు మృతి

**నరసన్నపేట, నవంబరు 6 (వార్త):** మండలంలోని రెల్లివలస గ్రామం వద్ద విద్యుత్ స్తంభాలు వేస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో బాణాల రాము (37) అనే కార్మికులు మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడ్డాడు. ఉర్లాం సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ స్తంభాలు వేసేందుకు ట్రాక్టరుపై నుంచి దించే సమయంలో ఒక్కసారిగా పక్కకు ఒరిగింది. దీంతో తోటి కార్మికుల చేతుల్లో ఉన్న స్తంభం జారిపోయి కిందన ఉన్న నడగాం గ్రామానికి చెందిన రాముపై పడింది. దీంతో రాము అక్కడికక్కడే మృతి చెందగా, రాంబాబుకు గాయాలయ్యాయి. ఎస్ఐ దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు ఐక్యతా ర్యాలీ

**శ్రీకాకుళం, నవంబరు6(వార్త):** సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్యతా రెండవ పాదయాత్ర ర్యాలీ శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు చిలకపాలెం జంక్షన్ నుండి కేశవరెడ్డి స్కూల్ వరకూ నిర్వహించనున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వర రావు తెలిపారు. కేశవరెడ్డి స్కూల్ గ్రౌండ్‌లో సాయంత్రం నాలుగు గంటలకు సమావేశం ఉంటుందన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో పాటు 500 మంది యువత ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారన్నారు.

## 13న 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ రాక

**శ్రీకాకుళం, నవంబరు6(వార్త):** 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ ఈనెల 13న శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శ్రీకాకుళం కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం పదిన్నర గంటలకు జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో సమీక్షా ఆయన సమావేశం నిర్వహిస్తారన్నారు.

# సీఐ రైటర్ల.. పెత్తనం



* ఎస్పీ ఆదేశాలను పట్టించుకోని పలువురు ఎస్‌హెచ్‌వోలు
* వారి అండదండలతో పేట్రేగిపోతున్న రైటర్లు
* జిల్లా పోలీస్‌బాస్ దృష్టికి తీసుకువెళ్లేందుకు సంసిద్ధులవుతున్న పలువురు కానిస్టేబుళ్లు

**శ్రీకాకుళం క్రైం, నవంబరు 6 (వార్త):** ప్రతి పోలీస్ స్టేషన్‌లో అన్ని ఉద్యోగాలు అందరూ చేయాలని, రైటర్ల వ్యవస్థను పక్కన పెట్టాలని జిల్లా పోలీస్‌బాస్ హెచ్చరికలు జారీ చేసినా కొందరు స్టేషన్ హౌస్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ రైటర్లను సీఐలు వెనకేసుకురావడంతో వారు మరింతంగా రెచ్చిపోతూ స్టేషన్‌లో తామే బాసులమని, తాము లేకపోతే స్టేషన్లలో అన్ని పనులు ఆగిపోతాయని బిల్డప్ ఇస్తున్నారు. కొందరు పోలీసులపై జులుం ప్రదర్శిస్తున్నారు. తమకు నచ్చిన వారికో డ్యూటీ, నచ్చని వారికి మరో డ్యూటీ వేస్తూ తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. దీనివల్ల స్టేషన్లలో సిబ్బంది మధ్య గొడవలు జరుగుతున్నాయి. మరో విషయమేమిటంటే రైటర్లంతా కలిసి వాట్సాప్ గ్రూపును కూడా ఏర్పాటు చేసుకున్నారు. కొందరు సీఐ రైటర్లు ఎన్నో ఏళ్లుగా స్టేషన్‌లోనే పాతుకుపోయారు. స్టేషన్లలో సెటిల్‌మెంట్లు, కేసుల నమోదు తదితర పనులు కూడా వీరి కనుసన్నల్లోనే జరుగుతున్నాయని తోటి సిబ్బంది బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దీనిపై కొందరు సీఐలు, డీఎస్పీల దృష్టికి తీసుకువెళ్లినా వారు ఆవిషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లడం లేదు. దీంతో సీఐ రైటర్ల వల్ల ఇబ్బందులు పడుతున్న కొందరు కానిస్టేబుళ్లు ఏకంగా జిల్లా పోలీస్‌బాస్‌ను కలిసేందుకు సన్నద్ధమవుతున్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వెనుక..
# పెద్ద స్థాయి కుట్ర





* ప్రమాదంలో సామాన్య ప్రజల ఆరోగ్యం
* మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి
* ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలపై ధ్వజం
* మెట్టూరు, గూనభద్రలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ

**కొత్తూరు, నవంబరు6 (వార్త):** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వెనుక పెద్ద స్థాయిలో కుట్ర నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యం ప్రైవేటు వ్యాపార దందాలకు బలవుతోందని ఆరోపించారు. కొత్తూరు మండల పరిధిలోని మెట్టూరు బిట్-3, గూనభద్ర గ్రామాల్లో గురువారం ఆమె ఆధ్వర్యంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాన్య ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడిందన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ జరిగితే సామాన్యులకు ఉచిత వైద్యం అందని ద్రాక్షగా మారుతుందన్నారు. దీన్ని పసిగట్టిన వైసీపీ అధిష్టానం ప్రజల ఆరోగ్య హక్కుల కోసం కోటి సంతకాల ఉద్యమానికి తెరలేపిందన్నారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఇసుకలో అవినీతి, మద్యంలో అక్రమాలు, భూముల దందాలు నడుపుతూ రాక్షస పాలన సాగిస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధిని పక్కకు పెట్టి కేవలం ఫొటోలకు ఫోజులు మాత్రమే ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ మండల కన్వీనర్ గండివలస ఆనంద్, నాయకులు చింతాడ సూర్యనారాయణ, పిన్నింటి శేషగిరి రావు, సర్పంచ్ ధర్మ, నాగేశ్వరరావు, రంజిత్, హరీష్, మఠం పూర్ణ, ఆయా గ్రామాల మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రాష్ట్రస్థాయి పోటీలకు 34 మంది విద్యార్థులు

**నరసన్నపేట, నవంబరు 6(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు 34 మంది ఎంపికైనట్లు హెచ్ఎం పైడి వెంకటరావు తెలియజేశారు. శ్రీకాకుళంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో నిర్వహిస్తున్న ఎంపిక పోటీల్లో వివిధ క్రీడల్లో ప్రతిభకనబరిచారని ఆయన అన్నారు. ఎంపికైన విద్యార్థులను గురువారం పాఠశాల సమావేశంలో అభినందించారు. ఉపాధ్యాయులు సాయి శ్రీనివాస్ శర్మ, పీడీలు పాల్గొన్నారు.



# కొబ్బరికాయ కొనలేం..తినలేం..!

**-కార్తీక మాసంలో యమ డిమాండ్**

**-ఇదే అదనంగా ధర పెంచేసిన వ్యాపారులు**

**-ప్రస్తుతం రూ.50 నుంచి రూ.60 పలుకుతున్న వైనం**

**-గత నెలకు..ఈ నెలకు రూ.30వరకు పెరిగిన ధర**

**(సరుబుజ్జిలి)**

సామాన్యుడి నుంచి ధనికుడు వరకు దేవాలయాలకు కొబ్బరికాయ కొనాల్సిందే. అలాంటి కొబ్బరికాయ ధర కార్తీక మాసంలో ధర మండిపోతోంది. గత నెలలో 30 రూపాయలు పలికిన కొబ్బరికాయ ధర ప్రస్తుతం 50-60 రూపాయలనేసరికి భక్తులు ఈ ధర ఏంటి రా అని తలలు పట్టుకుంటున్నారు.

జిల్లాలో సుమారు 68 వేల హెక్టార్లలో కొబ్బరి తోటలు ఉన్నట్టు అధికారులు తెలుపుతున్నారు. నిత్య పంట అయిన కొబ్బరికి కార్తీకమాసం వచ్చేసరికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. దేవాలయాలకు పెద్ద ఎత్తున భక్తులు కొబ్బరికాయలను తీసుకుని అభిషేకాలు చేసు కుంటారు. కార్తీకమాసం నుంచి సంక్రాంతి వరకు అయ్యప్ప దీక్ష చేపట్టిన భక్తులు, భవానీలు ప్రతిరోజు కొబ్బరికాయతో దేవుడికి అభిషేకం చేస్తుంటారు. కార్తీక సోమ వారాలు వచ్చాయంటే మరీ డిమాండ్ పెరుగుతుంది. అలాగే ఆసుపత్రుల ముందు కూడా కొబ్బరి బొండాలు 50 రూపాయలకే వినియోగదారులకు అమ్ముతున్నారు. కొబ్బరి బొండం నీళ్ల రోగులకు మంచిదేనని వైద్యులు కూడా సూచనలు ఇవ్వడంతో ఆ ధర పలుకుతోంది. ఇదే అదనని కొంతమంది దళారులు గ్రామీణ ప్రాంతాలలో ఉన్న కొబ్బరి తోటలలోకి వెళ్లి కొబ్బరి పంటను అతి తక్కు వకు కొన్ని మూడు రెట్లు లాభం పొందుతున్నారు. ఇక్కడ నష్టపోయేది కొబ్బరి పండించే రైతు, వినియోగదారుడే అని ప్రజలంటున్నారు. ఏది ఏమైనప్పటికీ కొబ్బరికాయ ధర చాలా ఎక్కువగా ఉందన్న మాట నిజం.



## వ్యాసరచన పోటీలు



**పలాస, నవంబరు 6(వార్త):** జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా గౌరవ రాష్ట్ర న్యాయ సేధికార సంస్థ ఆదేశాల మేరకు కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలను మండల న్యాయ సేవా సంఘం గురువారం నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో విద్యార్థులకు ( విజేతలకు ) పలాస జూనియర్ జడ్జి యు.మాధురి బహుమతులు అందజేశారు. ప్రాథమిక హక్కులు ప్రాథమిక విధులు, ఆదేశ సూత్రాలపై నిర్వహించిన ఈ పోటీలలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో ఎనిమిదో తరగతి చెందిన విద్యార్థి జి.తనుశ్రీ, రెండో స్థానములో ఎం.నేహ, టీ నవ్యాలు విజేతగా నిలిచారు. 10వ తరగతి విద్యార్థి గాయత్రీకి కన్సొలేషన్ బహుమతి లభించింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫయాజ్ అహ్మద్, ఉపాధ్యక్షులు బీకేఆర్ పట్నాయక్, జాయింట్ సెక్రటరీ జీఎంఎస్ అనిల్‌రాజ్, న్యాయవాదులు జి.ప్రభాకర్, తాండ్ర మురళీమోహనరావు, రవి చిట్టిబాబు, సూపరింటెండెంట్, కె.కృష్ణ, కోర్ట్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రాజ్యాంగ దినోత్సవ పోటీలు




**ఇచ్ఛాపురం, నవంబరు 6(వార్త):** ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శరత్‌బాబు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి రాజ్యాంగ దినోత్సవ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం బాలురు, బాలికలు ,కవిటి, సోంపేట ,కంచిలి మరియు బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా వ్యాసరచన మరియు వక్తృత్వ విభాగాల్లో పోటీలు నిర్వహించి అందులో గెలుపొందిన ఆరుగురు విద్యార్థులకు వ్యక్తిగత క్విజ్ విభాగంలో పోటీలు నిర్వహించి ప్రథమ బహుమతి సోనాలి సాహు సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల రెండో బహుమతి ఎస్ లక్ష్మణ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కంచిలి అలాగే మూడో బహుమతి అంజలి బెహరా ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలు ఇచ్ఛాపురం గెలుచుకున్నారు. గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు అలాగే ఈ విభాగాల్లో పార్టిసిపేట్ చేసిన విద్యార్థిని విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నల్లన రమేష్ బోరుభద్ర సురేష్ కుమార్ పైడి సురేష్ కుమార్ నూకల రాజశేఖర్ చింతాడ పాపారావు, సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు నారాయణరావు , బారువ జూనియర్ కళాశాల పౌరశాస్త్రం అధ్యాపకులు శరత్, కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల చరిత్ర అధ్యాపకులు ఆనంద్ పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు డొంకూరు విద్యార్థులు



**ఇచ్ఛాపురం, నవంబరు 6(వార్త):** రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకూరు బాలికలు ఎంపికయ్యారు. ఇటీవల శ్రీకాకుళం ఇండోర్ స్టేడియంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపికలో ఉన్నత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను వీరిలో జె. అను, ఎస్ హేమలత లు ఎంపికయ్యారు. ఈ నెల 7 నుంచి 9 వరకు కడప జిల్లా బద్వేలు లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు నుంచి ఆతిథ్యం ఇవ్వను న్నారు. వీరు ఎంపికపై పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.హేమకుమారి, చైర్మన్ కె.జానకీరావు, ఉపాధ్యాయులు వెంకట్రావు గోవిందరావు, శ్రీహరి, శంకర్ రెడ్డి, నూక్కయ్య,గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

## పలాస-కాశీబుగ్గలో అగ్నిప్రమాదం

**- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం**

**పలాస, నవంబరు 6(వార్త):** పలాస-కాశీబుగ్గ హరిజన వీధికి చెందిన కొత్తపల్లి లీలావతి అంగన్‌వాడీ టీచర్ ఇంట్లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. మంటల వ్యాపించగా స్థానికులు భయాందోళనకు గురి అయ్యారు. దీంతో స్థానికులు అగ్ని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా విఫలమయ్యారు. కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సిబ్బంది మంటలను నియంత్రించారు.. ఇంటిలో ఉన్న వస్తువులు అగ్నికి ఆహుత అయ్యాయని తమాను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. స్థానిక వార్డ్ కౌన్సిలర్ ప్రతినిధి పోతనపల్లి హరి ఆధ్వర్యంలో యువత సహకారంతో అగ్ని మంటలు అదుపు చేసేందుకు తీవ్రంగా కృషి చేశారు. అగ్ని ప్రమాదంలో సుమారు మూడు లక్షల ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని పలువురు భావిస్తున్నారు. ఈ ప్రమాదానికి కారణంగా షార్ట్ సర్క్యూట్ జరిగి ఉండొచ్చని బాధితులు తెలుపుతున్నారు.





# వైసీపీ పటిష్టతకు కృషి చేయండి

**-బమ్మిడికి జగన్ సూచన**

**-పోలీసు కేసులకు భయపడవద్దని భరోసా**

**పలాస, నవంబరు 6(వార్త):** వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ఇటీవల తాడేపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ అధినేత , మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నేతృత్వంలో బమ్మిడి దుర్యోధన రావు తో పాటు వైఎస్ఆర్సిపి పలాస మండల శాఖ అధ్యక్షులు దువ్వాడ రవి కలిశారు. ఈ సందర్భంగా బమ్మిడి దుర్యోధనరావును వైయస్ జగన్ కు పరిచయం చేస్తూ, పలాస నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి కార్యక్రమాలు విజయవంతం చేస్తున్న నేపథ్యంలో సుమారు 6 కేసులను అక్రమంగా పోలీసులు బనాయించారని ఆయన వివరించారు. వెంటనే జగన్ స్పందిస్తూ.' దుర్యోధనరావు.. నీవు అతని పడవద్దు. భయపడవద్దు...పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పని చెయ్యండి.. పార్టీ మీకు అండగా నిలుస్తుందని" అంటూ భరోసా ఇచ్చారు.



విద్యావంతులైన మీలాంటివారు కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఎండగడుతూ వైఎస్ఆర్సిపి చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లోకి వెళ్లి తీసుకువెళ్లాలని జగన్ సూచించారు. అందుకు బమ్మిడి దుర్యోధన రావు కూడా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పలాస నియోజకవర్గం కానుకగా ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఐటీడీఏ పీఓ దృష్టికి చాపరాయి కాలనీ భూసమస్య



**మందస, నవంబరు 6(వార్త):** కొండలోగాం రెవెన్యూలో చాపరాయికాలనీలో గిరిజనులకు, గిరిజనేతరులకు మధ్య రగులుతున్న భూవివాదం ఐటీడీఏ చేరింది. పరిష్కారానికి గిరిజనులు తిరగుతున్నప్పటికీ పరిష్కారాన్ని మందస తహసీల్దార్ చూపడం లేదని గిరిజన నాయకులు, రైతుసంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. మందస మండలం రెవెన్యూ పిప్పు షెడ్యూల్లో లేనందున ఎవరైన కొనుక్కోవచ్చు.. అనే వాదనలు ఉన్నప్పటికీ గిరిజనేతరుల దగ్గర ఉన్న జిరాయితీ డాక్యుమెంట్స్ ఎలా ధఖలు పడ్డాయే తెలపమని డిమాండ్ చేసారు. చాపరాయికాలనీలో గత గ్రీవెన్స్ లో దరఖాస్తు పెట్టుకున్న సవర మాదవరావు, సవర జ్యోతి దంపతులు కలిసి సాగు చేసుకున్న భూమిని రీసర్వేలో గిరిజనేతరులకు రికార్డ్ చెయ్యడాన్ని రెవెన్యూ అధికారులకు ప్రశ్నించారు. నోటీసుకి స్పందించిన మండల సర్వేయర్ బాబురావు, వీఆర్వో తులసీదాస్ ల సమక్షంలో తమ ఆధీనంలో ఉన్న భూమిని పరిశీలించారు. సర్వే ప్రాప్తికి భూమి రికార్డ్ చేస్తామని తెలిపారు. ఎండార్స్ మెంట్ కాపీను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకుడు మద్దిల రామారావు, రైతు కూలీ సంఘం నాయకుడు కోనేరు రమేష్, గిరిజన సంఘం నాయకులు సవర నర్శింహులు, సవర జగ్గారావు, సవర జయరాజు, లక్ష్మినారాయణ, లక్ష్మణ, హరిక్రృష్ణ, బాలక్రృష్ణ, తిరుపతి, తులసీ, ఉమాపతి, నారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

**ఇచ్ఛాపురం, నవంబరు 6(వార్త):** జ్ఞానభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఈనెల 9వ తేదీన లీగల్ సర్వీస్ డే సందర్భంగా స్థానిక మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో ఇటీవలే నిర్వహించిన వ్యాసరచన పోటీలను విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహించారు. స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పి.పరమేష్ కుమార్ విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు.ప్రాథమిక హక్కులు విధులు, రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు అనే అంశంపై 8, 9,10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సుమారు 250 మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరుకాగా అందులో మొదటి నాలుగు స్థానాలు సాధించిన విజేతలకు బహుమతులు అందించారు. మొదటి స్థానాన్ని కాళ్ల వైష్ణవి, ద్వితీయ స్థానాన్ని ఆహిల్ అక్బర్ ఖాన్ తృతీయ స్థానాన్ని సౌమ్యా సుహానా, నాలుగవ స్థానాన్ని బత్తిన గ్రీష్మిత గెలుచుకున్నారు. విజేతలకు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లీగల్ సర్వీస్ డే సందర్భంగా నిర్వహించిన పోటీలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు రాజ్యాంగంపై అవగాహన పెంచుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్



సీఈవో సెక్రటరీ జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యనిర్వాహక ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి పండ, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరులో భక్తి..ప్రపత్తులతో కార్తీక దీపోత్సవం

**కొత్తూరు, నవంబరు 6(వార్త):** కొత్తూరు శ్రీశ్రీశ్రీ వరప్రద వెంకటేశ్వర స్వామివారి దేవాలయంలో గురువారం జరిగిన కార్తీకదీపోత్సవంలో శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు ఆయన సతీమణి త్రివేణి దంపతులు పాల్గొన్నారు. మండల బీజేపీ నాయకులతో, భక్తులతో కలిసి వారు స్వామివారి సమక్షంలో దీపం వెలిగించి ప్రార్ధనలు చేశారు.రైతులందరి పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామి వారి వద్ద తేజేశ్వరరావు కోరుకున్నారు. అనంతరం స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి, భక్తులతో కాసేపు మాట్లాడారు.ఆలయం పరిసరాలు దీపాలతో నిండిపోగా, భక్తుల జపాలు, హారతలతో ఆ ప్రాంతం భక్తిమయ వాతావరణంగా మారింది. ఈ కార్యక్రమంలో సిరిపురం తో పాటు బీజేపీ జిల్లా కార్యదర్శి కాపలా దమయంతి, పూర్వ జిల్లా కార్యదర్శి వలురౌతు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు చోడవరపు నరసింహమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి చల్ల ఈశ్వర్, పొగిరి రవి పాల్గొన్నారు.



## యాదగిరిగుట్టలో మందస నృత్య విద్యార్థుల ప్రతిభ

**-31న శిల్పారామంలో పాల్గొనే అవకాశం**



**మందస, నవంబరు 6(వార్త):** శ్రీసాయి మెహెర్ నృత్య కళాక్షేత్రం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. పలు ప్రాంతాల్లో తమ నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. నాట్యగురువు నారాయణశెట్టి శైలజ ఆధ్వర్యంలో శ్రీసాయి మెహెర్ నృత్య కళాక్షేత్రం విద్యార్థులు భరతనాట్యం, కూచిపూడి నాట్యాలతో తమ ప్రతిభా, పాటవాలను ప్రదర్శిస్తున్నారు. యాదగిరిగుట్టలో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా నృత్యార్చన చేశారు. భారతీయ సంప్రదాయ నృత్యాలతో భక్తి భావనను ప్రేక్షకులకు కల్పించారు. అదేవిధంగా ఈ నెల 31న తెలంగాణాలోని హైదరాబాదులో గల శిల్పారామంలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఈ కళాకారులకు దక్కింది. నృత్య ప్రదర్శనలో నాట్య గురువు శైలజతో పాటు డింపుల్, త్రయంబి, విమల, పూజిత, తేజేశ్వరరావు, కీర్తన, మనీషా, ధాన్విక, ఢిల్లేశ్వరి, అంజనాశ్రీ, హేమాన్య, ప్రణవి తదితరులు ఉన్నారు.

## 9న హరిపురంలో వంశధార సాగునీరు సాధన కమిటీ సమావేశం

**మందస, నవంబరు 6(వార్త):** వంశధార సాగునీరు సాధన కమిటీ సమావేశం ఈనెల 9న మందస మండలంలోని హరిపురంలో మార్పు గ్రంథాలయంలో జరుగుతుందని కమిటీ అధ్యక్షుడు మార్పు మన్మధరావు, నాయకులు చెప్పారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ సమావేశంలో సమీక్ష, విస్తృతస్థాయి సమావేశం, కరపత్రం ఆవిష్కరణ, భవిష్యత్ కార్యక్రమాలు గూర్చి చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి రైతులు, సంఘ సభ్యులు, మేధావులు, కళాకారులు అందరూ హాజరు కావాలని వారు కోరారు.

## అలరించిన కూచిపూడి నృత్యాలు



**ఇచ్ఛాపురం, నవంబరు 6(వార్త):** గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఇచ్ఛాపురం చిన్నారులు చేసిన కూచిపూడి భరతనాట్యం భక్తులకు ఎంతగానో అలరించాయి .నాట్య గురువు బలివాడ శృతి పట్నాయక్ అకాడమీ అధ్యక్షులు చిన్నా గురుస్వామి జయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో 30 మంది చిన్నారులు ఈ నాట్యంలో పాల్గొన్నారు. మహాగణపతిం. గోవింద శ్రీత. డమరుక నాట్యం. ఐగిరి నందిని జీయర్ జీయర్. ఏమి పరిమళం మొదలగు పాటలకు చక్కని హావభావాలతో నృత్యాన్ని అందించారు .ఈ కార్యక్రమంలో వేద పండితులు ఆలయ కమిటీ సభ్యులు చిన్నారులను సత్కరించారు .భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనలో క్షతగాత్రులకు చెక్కుల పంపిణీ

**పలాస, నవంబరు 6(వార్త):** పలాస నియోజకవర్గం కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం( చిన్న తిరుపతి) వద్ద తొక్కిసలాట జరిగిన ఘటన స్థలం లో గాయాలు పాలైన బాధితులకు కూటమి నేతలు చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చెక్కులను గురువారం పంపిణీ చేశారు. వజ్రపుకొత్తూరు మండలం శివరాం పురం గ్రామంకు చెందిన దట్టి.ఆధమ్మ, అదే మండలంలో సీతపురం గ్రామం నకు చెందిన దుంప. భారతిలిలకు వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం తరపున 1 లక్ష రూపాయలు విలువ గల చెక్కులును వజ్రపు కొత్తూరు మండల రెవిన్యూ అధికారులు, వజ్రపుకొత్తూరు మండల టిడిపినాయకులు చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శశిభూషణ్, బావన దుర్యోధన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీకాకుళం జిల్లా టెన్నికాయిట్ జట్టు

పలాస, నవంబరు 6, (వార్త): ఈనెల7, 8 ,9, తేదీలలో బాపట్ల జిల్లా చీరాలలో జరుగు 42వ ఆంధ్ర ప్రదేశ్ అంతర్ జిల్లాల 18 సంవత్సరాల లోపు బాల బాలికల టెన్నికాయిట్ పోటీలకు శ్రీకాకుళం జిల్లా జట్టు గురువారం బయలుదేరింది.

ఈ క్రీడాకారులకు క్రీడా దుస్తులను బొమ్మాలి రోహిణి వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మల్లా సంతోష్ కుమార్, సుడియా వెంకట జోగారావు, రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.తవిటయ్య, మొదటి జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి పి.గజేంద్రరావు పాల్గొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్లుగా బి.తిరుమలరావు, బి. మహేష్, లండ దిలీప్ వ్యవహరిస్తారని పి.తవిటయ్య తెలియజేశారు.

# 92 పైసల వడ్డీకే స్త్రీనిధి రుణాలు

**మందస, నవంబరు 6(వార్త):** అర్హత గల మహిళా సంఘాలకు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకై 92పైసలు వడ్డీకే సంఘం కోరిన 48గంటల్లోనే సరైన డాక్యుమెంటేషన్ ఉంటే రుణం ప్రాసెస్ చేయవచ్చునని వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. ఒక సంఘానికి రూ.8 లక్షలు వరకు మంజూరు చేయవచ్చునని వివరించారు. దీనికోసం మిగతా కమర్షియల్ బ్యాంకుల వలె పొదుపు ఖాతాలో డబ్బులు/నిల్వలు ఉండనవసరం లేదని, కేవలం సంఘం మొత్తం రూ.7,200లు మళ్లీ సంఘానికి తిరిగి వచ్చే సమృద్ధి డిపాజిట్ కడితే సరిపోతుందన్నారు. డాక్యుమెంటేషన్ చార్జీలు, ఇన్స్పెక్షన్ చార్జీలు ప్రాసెసింగ్ చార్జీలు లాంటివి ఫ్రీ సభ్యులు రుణ సురక్ష తప్ప ఏ విధమైన చార్జీలు చెల్లించనవసరం లేదన్నారు. పనులు మానుకొని బ్యాంకుల చుట్టూ తిరగనవసరం లేదని, కేవలం మీ గ్రామ సంఘంలోనే డాక్యుమెంటేషన్ చేస్తారన్నారు. రూ.50 వేలు 24నెలలకు కేవలం రూ.6377లు మాత్రమే వడ్డీ అవుతుందన్నారు. లక్ష రూపాయలకు 36 నెలలకు కేవలం రూ.19,257లు మాత్రమే వడ్డీ అవుతుందని, ఇంతకంటే ఎక్కడైనా ఎక్కువ వసూలు చేస్తే పూర్తి ఆధారాలతో మండల వెలుగు కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ఎంత అప్పు తీసుకుంటే నెలవారి ఎంత వడ్డీ చెల్లించాలో పూర్తి వివరాలను ప్రభుత్వము/స్త్రీనిధి బ్యాంకు తగు వివరాలతో పోస్టర్లను/గోడ పత్రికలను అన్ని గ్రామాలలో పంచాయతీ కార్యాలయం, గ్రామ సచివాలయం, ప్రధానంగా ఎక్కువమంది మనుషులు సంచరించే స్థలాలలో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. మందస గ్రామ సంఘం, సచివాలయం, పంచాయతీ కార్యాలయంలో మహిళలు వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో పోస్టర్లను అతికించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావుతో సహా క్లస్టర్ కోఆర్డినేటర్లు బాలకృష్ణ ముఖలింగం, వి.వో.ఏ.లు గాయత్రి, శోభ, గ్రామ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## వర్మీ కంపోస్ట్‌పై శ్రద్ధ చూపండి



**నరసన్నపేట, నవంబరు 6(వార్త):** పంచాయతీల్లో ఏర్పాటుచేసిన వర్మీ కంపోస్టులపై సంబంధిత పంచాయతీ కార్యదర్శులు శ్రద్ధ వహించాలని జడ్పీ సీఈవో సత్యనారాయణ తెలిపారు. గురువారం నరసన్నపేట మండలంలో పలు పంచాయతీల్లో ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సేకరణ దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యర్థాలను వర్మీ కంపోస్టుకు చేర్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో కె.ప్రసాదరావు పాల్గొన్నారు.

## సెల్ టవర్ల ఏర్పాటుకు చర్యలు




**సారవకోట, నవంబరు 6(వార్త):** గిరిజన ప్రాంతాల ప్రజలు సెల్ సిగ్నల్ లేక ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం సారవకోటలో గిరిజన ప్రాంతాలైన పనసలోవ. సింగం వలస. బొంతుగోడ సోడా గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి నాలుగు సెల్ టవర్లు మంజూరయ్యా యని తెలిపారు. ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



**నరసన్నపేట, నవంబరు 6(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వైస్ ప్రిన్సిపల్ శాంతి హేమ్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతలను స్వీకరించారు. మొక్కలు పర్యావరణానికి హితం చేస్తాయని, మొక్కలు నాటేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని, సంరక్షణ బాధ్యత కూడా చేపట్టాలని వైస్ ప్రిన్సిపల్ అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## మండల కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు



**నరసన్నపేట, నవంబరు 6(వార్త):** నరసన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో సత్యనారాయణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వాటర్ స్కీమ్, చెత్త సంపద కేంద్రాన్ని, హౌసింగ్ లేఔట్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు వాటర్ టెస్టు చేయాలని ఆర్డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. ప్రతి రోజు ఈ ఇంటింటికీ చెత్త సేకరణ జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఆర్డబ్ల్యుఎస్ అధికారులు హౌసింగ్ ఏఈ సిబ్బంది పాల్గొన్నారు.

## జలుమూరు ఉన్నత పాఠశాలలో డీఈవో తనిఖీలు

**జలుమూరు, నవంబరు 6(వార్త):** జలుమూరులోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రవి బాబు ఆకస్మికంగా సందర్శించారు. గురువారం ఉదయం పాఠశాలకు చేరుకున్న ఆయన బుక్ లెట్స్ అసెస్మెంట్ ఏ విధంగా నిర్వహిస్తున్నారో పరిశీలించారు. తప్పనిసరిగా అసెస్మెంట్ రికార్డులను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు సిద్ధం చేయాలని ఆదేశించారు. బోధన పట్ల విద్యార్థుల స్పందన కూడా ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ పాల్గొన్నారు.



## వంశధార కాలువ గట్టుకు గండి



**నరసన్నపేట, నవంబరు 6(వార్త):** ఉర్లాం పరిధిలో వంశధార కాలువకు గండి పడింది. గురువారం ఉదయం సర్పంచ్ పోలాకి నరసింహమూర్తి గండి పడిన ఘటనపై వంశధార అధికారులకు సమాచారం అందించారు. ఈ కాలువ ద్వారా కోమర్తి రెగ్యులేటరు సాగునీరు వెళుతుందని పేర్కొన్నారు. గండి కప్పేందుకు ప్రయత్నిస్తున్నామని, అధికారులు చొరవ చూపాలన్నారు.

## లండన్ నృత్య ప్రదర్శనలో నరసన్నపేట అమ్మాయి



**నరసన్నపేట, నవంబరు 6(వార్త):** లండన్‌లో జరిగిన వరల్డ్ టూరిజం వారు నిర్వహించిన నృత్య ప్రదర్శనలో నరసన్నపేటకు చెందిన కీర్తి ప్రియ పాల్గొన్నారు. ఈ నెల 4 నుంచి 6 తేదీ వరకు అక్కడ ప్రదర్శనలు చేశారు. ఆ కార్యక్రమానికి మంత్రి దుర్గేశ్, రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి దివ్య కుమారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కీర్తి ప్రియ నృత్య ప్రదర్శనను తిలకించిన వారు ఆమెను అభినందించారు.

## గురు భవానీలకు ఘన సన్మానం



**కోటబొమ్మాళి, నవంబరు 6(వార్త):** కొత్తపేట శ్రీ కొత్తమ్మతల్లి అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి రెడ్డి వీరన్న గురు భవాని, మెండ వీరాస్వామి గురు భవానిల ఆధ్వర్యంలో భవానిలచే భజన కార్యక్రమం జరిగింది. భజన కార్యక్రమం అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురు భవాని లుకు దుశ్శాలువాతో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ధర్మాన నాగరాజు, ఇరానీ టీ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం

**శ్రీకాకుళం, నవంబరు 6(వార్త):** జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం రాగోలులోని జెమ్స్ ఆసుపత్రిని సందర్శించారు. కాశీబుగ్గ దుర్ఘటన బాధితులకు అందుతున్న వైద్య సేవలు, డిశ్చార్జ్ వివరాలను ఆయన ఆరా తీశారు. తొక్కిసలాటలో రెండు కాళ్లకు ఎముకలు విరిగి శస్త్రచికిత్స చేయించుకున్న పలాస బాధితురాలు కళావతిని కలెక్టర్ ప్రత్యేకంగా పరామర్శించారు. చికిత్స పొందుతున్న బాధితులలో ఒకరు ఈ రోజు డిశ్చార్జ్ అయినట్లు తెలిపారు. మిగిలిన క్షతగాత్రులకు మరింత మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రి వైద్యులకు ప్రత్యేకంగా సూచించారు. డాక్టర్ ఏ హేమంత్, డాక్టర్ లక్ష్మీ లలిత, డాక్టర్ సురేష్, డాక్టర్ ప్రవీణ్ కలెక్టర్ తో పాటు ఉన్నారు.



## ఘనంగా కళాకారుల వనభోజన మహోత్సవం



**ఇచ్ఛాపురం, నవంబరు 6(వార్త):** టి.బరంపురం గ్రామంలో మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కళాకారుల కార్తీక వనభోజనం మహోత్సవ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం సూపరిండెంట్ క్రాంతి కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారులు కళాకారుల యొక్క విశిష్టతని, భగవంతునికి కళాకారులకీ ఉన్న అనుబంధాన్ని వివరిస్తూ పాల్గొన్న కళాకారులు అందరికీ ఆయన చేతుల మీదగా దుస్సాలతో సత్కరిస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో మహతి సంస్కృతిక కళాసేవా సంస్థ ప్రధాన సలహాదారులు తిప్పన దాలయ్య రెడ్డి ని సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. సంస్థ కళాకారులచే సీతారామ ఆలయ ప్రాంగణంలో సంగీత కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం మధ్యాహ్నం పంక్తి భోజనం ఏర్పాటు చేసుకొని, భవిష్యత్తులో కళాకారుల యొక్క మనుగడ, కళాకారుల యొక్క విలువలను కళాకారులు సమిష్టిగా ఉండి వాటి విలువలను కాపాడుకో వలసిందిగా సంస్థ వ్యవస్థాపకుడు, సెక్రెటరీ తిప్పన ధనంజయ రెడ్డి కళాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, సర్పంచ్ కారింగి త్రినాథ్ రెడ్డి, ప్రచార కార్యదర్శి చలపరాయి వినోద్ కుమార్, సలహాదారులు బోర రామారావు, దోట్ల వెంకటేశం, మార్పు నారాయణరావు, సారీ హేమ సుందర్, బుర్ర జయదేవ్, ధనల కూర్మారావ్, దక్కత వాసు, బొగత జగన్, కొయ్య రాజు, సంతోష్, లావణ్య రెడ్డి, ఇందు రెడ్డి, రమ రెడ్డి, దూపన నారాయణ, ధూపాన నూకరాజు, తిప్పన తమ్మయ్య, మచ్చ నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.

## నరసన్నపేటలో సత్యసాయి సేవా కార్యక్రమం



**నరసన్నపేట, నవంబరు 6(వార్త):** భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి దివ్య అనుగ్రహాశీస్సులతో స్వామివారి శతవర్ష జన్మదిన వేడుకలలో భాగంగా గురువారం నరసన్నపేటలో సేవా కార్యక్రమం నిర్వహించారు. మారుతీ నగర్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులు, ఇతర విభాగాలకు చెందిన సిబ్బందిలో మొత్తం 90 మందికి దుస్తులు పంపిణీ చేశారు. పురుషులకు డ్రెస్సులు, మహిళా సిబ్బందికి చీరలు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, అర్చన అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమణమూర్తి మాట్లాడుతూ "మానవసేవయే మాధవసేవ అనే సత్యసాయి బాబా బోధన ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలి" అని అన్నారు. సత్యసాయి బాబా మానవత్వం, సేవా భావం, ప్రేమకు ప్రతీకగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అడప చంద్రశేఖర్, శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు రామారావు, మేజర్ పంచాయతీ వైస్ సర్పంచ్ ఎస్. కృష్ణబాబు, గొద్దు చిట్టిబాబు, రాజేశ్వరి, కార్యనిర్వహణాధికారి దాక్షాయిని మేడం, ఆర్యవైశ్య నాయకులు జామి వెంకటరావు, బైరి భాస్కరరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## బాలియాత్ర ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



**జలుమూరు, నవంబరు 6(వార్త):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీముఖలింగంలో ఈ నెల 9వ తేదీన జరగనున్న బాలియాత్రకు సంబంధించి భద్రతా, నిర్వహణ ఏర్పాట్లను అధికారులు శుక్రవారం సమీక్షించారు. టెక్కలి డీఎస్పీ డి. లక్ష్మణరావు స్వయంగా ఘాట్ ప్రాంతాలను, యాత్ర మార్గాలను పరిశీలించారు.

ఆయనతో పాటు నరసన్నపేట సిఐ ఎం. శ్రీనివాసరావు, జలుమూరు ఎస్ఐ అశోక్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. యాత్ర సందర్భంగా భక్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని డీఎస్పీ సూచించారు. అలాగే జలుమూరు ఎం.ఆర్.ఓ రామారావు ప్రాంతీయ అధికారులతో సమన్వయం చేస్తూ తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య చర్యలపై సూచనలు అందించారు. భక్తులు విస్తృతంగా పాల్గొననున్న నేపథ్యంలో అధికారులు అన్ని విభాగాల సహకారంతో ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని తెలిపారు.

## పలాస వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షునిగా సంతోష్

**పలాస, నవంబరు 6(వార్త):** పలాస నియోజకవర్గం విద్యార్థి విభాగం సంతోష్ తో వైఎస్ఆర్ జగన్మోహన్ రెడ్డిను అమరావతిలో ఉన్న కార్యాలయంలో గురువారం సమావేశం అయ్యారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల స్టూడెంట్ వింగ్ అధ్యక్షులతో వైయస్ జగన్‌ను భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జగనన్న విద్యార్థి నాయకుల అందరని కలిసి ప్రతీ ఒక్కరితో ఆత్మీయంగా మాట్లాడటం జరిగిందని, వారు చెప్పిన ప్రతి విషయం ఎంతో ఓపికగా వినడం జరిగిందని బమ్మిడి సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా నాకు పలాస నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన మా నాయకుడు, పలాస నియోజకవర్గం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు ధన్యవాదములు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. కూటం ప్రభుత్వంను ఎదుర్కొని పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన శక్తి మేరకు కృషి చేస్తానని తెలిపారు. వైసిపి స్టూడెంట్స్ విభాగంను పార్టీ బోలోపతనికి తన వంతు ప్రయత్నిస్తానని బోరోసిచ్చారు. తనను నమ్మి పార్టీలో కీలకమైన పదవి ఇచ్చినందుకు ప్రత్యేకంగా అప్పలరాజుకు ధన్యవాదాలు తెలిపారు. నియోజవర్గం స్టూడెంట్స్ విభాగం అధ్యక్షుడుగా నియమించినందుకు పేరుపేరునా నియోజవర్గ వైసిపి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 'జల్ జీవన్' పనుల పర్యవేక్షణకు గ్రామ కమిటీలు

**శ్రీకాకుళం, నవంబరు 6(వార్త):** జల జీవన్ మిషన్ (జేజేఎం) కార్యక్రమాన్ని వేగవంతం చేయడానికి, క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణకు తక్షణమే గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డిప్యూటీ ఎంపీడీఓలను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డిప్యూటీ ఎంపీడీఓలతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రతి గ్రామంలో విలేజ్ వాటర్ అండ్ శానిటేషన్ కమిటీలను ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలో 15 మంది సభ్యులు ఉండాలి, అందులో సగం మంది మహిళలు తప్పనిసరి. సర్పంచ్ ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. జేజేఎంకు సంబంధించిన అన్ని పనులూ ఈ కమిటీ తీర్మానం ద్వారానే జరగాలి" అన్నారు. 'హర్ ఘర్ జల్' డిక్లరేషన్ సాధించే ప్రక్రియ వేగం పుంజుకోవాలని, డిక్లరేషన్ చేసే పనికి సంబంధించి ఒక్క నిమిషం నిడివి గల వీడియోను తప్పక రికార్డు చేయాలని, నీటి నాణ్యతను పరీక్షించడానికి అవసరమైన టెస్టింగ్ కిట్‌లను వెంటనే కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# జూదం, బహిరంగ మద్యపానం నిషేధం

*శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద *కోర్టు తీర్పును అనుసరించి ప్లకార్డులు ప్రదర్శన




**శ్రీకాకుళం, నవంబరు 6(వార్త):** శ్రీకాకుళం సెకండ్ క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ కె.శివరామకృష్ణ బుధవారం వెల్లడించిన తీర్పును అనుసరించి సామాజిక సేవలో భాగంగా పేకాటలో పట్టుబడిన ఐదుగురు వ్యక్తులు శ్రీకాకుళం వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని పిఎస్ఆర్ కూడలి వద్ద జూదం ఆడటం చట్ట రీత్యా నేరం, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధం అనే ప్లకార్డులు ప్రదర్శించారు. జూదం, మద్యపానం వలన వ్యక్తిగత, కుటుంబ, సామాజిక జీవితాలు దెబ్బతింటున్న నేపథ్యంలో ఇటీవల శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతూ పట్టుబడిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ జరిపిన శ్రీకాకుళం సెకండ్ క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ కె. శివరామకృష్ణ బుధవారం తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో ఐదుగురు ముద్దాయిలకి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున జరిమానాతోపాటు పది రోజులు శ్రీకాకుళం పట్టణంలో గల ముఖ్యమైన కూడలిలో, జూదం నిషేధము, బహిరంగ ప్రదేశంలో మద్యపానం నిషేధం వంటి ప్లకార్డులు ఉదయం సాయంత్రం ప్రదర్శించాలని మెజిస్ట్రేట్ తీర్పు మేరకు ఈ ఐదుగురు వ్యక్తులు గురువారం ఉదయం శ్రీకాకుళం పీఎస్ఆర్ కూడలిలో జూదం ఆడరాదని, చట్ట రీత్యా నేరమని, బహిరంగంగా మద్యపానం నిషేధం అనే శీర్షికలతో శ్రీకాకుళం వన్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సీహెచ్ వివేకానంద మాట్లాడుతూ శ్రీకాకుళం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఇచ్చిన తీర్పు మేరకు, పేకాటలో పట్టుబడిన ఐదుగురు వ్యక్తులు సామాజిక సేవలో భాగంగా ప్లకార్డులు పట్టుకుని జూదము మద్యపానం నిషేధమని ప్రచారం చేశారన్నారు. జూదం, మద్యపానం వంటివి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పైడిపు నాయుడు, టూ టౌన్ సీఐ ఈశ్వరరావు, ట్రాఫిక్ సిఐ నాగరాజు, వన్ టౌన్ ఎస్సై హరికృష్ణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.



## క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలి



**శ్రీకాకుళం,నవంబరు 6(వార్త):** క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించి వారికి తోడ్పాటు అందించాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కె హరిబాబు సూచించారు. రాగోలులోని జెమ్స్ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన ఆయన కాశీబుగ్గ దుర్ఘటన క్షతగాత్రులను పరామర్శించి, వారికి అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. బాధితులకు అందిస్తున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, వారికి చెల్లించాల్సిన నష్టపరిహారం అంశంపై కూడా ఆరా తీశారు. మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని ఆయన వైద్యులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.హేమంత్, కోఆర్డినేటర్ ఎం.హర్షవర్ధన్, సిహెచ్ మీనా, జి.ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్ పరామర్శ



జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం రాగోలులోని జెమ్స్ ఆసుపత్రిని సందర్శించారు. కాశీబుగ్గ దుర్ఘటన బాధితులకు అందుతున్న వైద్య సేవలు, డిశ్చార్జ్ వివరాలను ఆయన ఆరా తీశారు. తొక్కిసలాటలో రెండు కాళ్లకు ఎముకలు విరిగి శస్త్రచికిత్స చేయించుకున్న పలాస బాధితురాలు కళావతిని కలెక్టర్ ప్రత్యేకంగా పరామర్శించారు. చికిత్స పొందుతున్న బాధితులలో ఒకరు ఈ రోజు డిశ్చార్జ్ అయినట్లు తెలిపారు. మిగిలిన క్షతగాత్రులకు మరింత మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రి వైద్యులకు ప్రత్యేకంగా సూచించారు. డాక్టర్ ఏ హేమంత్, డాక్టర్ లక్ష్మీ లలిత, డాక్టర్ సురేష్, డాక్టర్ ప్రవీణ్ కలెక్టర్ తో పాటు ఉన్నారు.

## పత్తి రైతుల ఇబ్బందులు పరిష్కరించండి

*రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
*కేంద్ర మంత్రికి లేఖ

**అమరావతి, నవంబరు 6(వార్త):** రాష్ట్రంలోని పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ, సహకార, పశు సంవర్ధక, మార్కె టింగ్, పాల, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.. కేంద్ర టెక్స్టైల్ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాశారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగు జరగగా, సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉందని తెలిపారు. అయితే మొంథా తుఫాన్ ప్రభావంతో పత్తి పంట తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరలకు పత్తిని విక్రయించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సీఎం యాప్, ఆధార్ ఆధారిత ఈ-పంట వ్యవస్థ ద్వారా పత్తి కొనుగోళ్లు పూర్తిగా డిజిటలైజ్ చేయబడిన విధానంలో నిర్వహిస్తున్నదని. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాపాస్ కిసాన్ యాప్‌ను రాష్ట్ర సీఎం యాప్‌తో అనుసంధానం చేసిన తర్వాత కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రైతులు తమ సమీప జిల్లాలోని జిన్నింగ్ మిల్లులలో పత్తి విక్రయించుకునే విధంగా మ్యాపింగ్ చేయా లని, కాపాస్ కిసాన్ యాప్ కోసం గుంటూరులో ప్రత్యేక సాంకేతిక సిబ్బందిని నియమించాలని, వాతావరణ పరిస్థితుల కారణంగా తేమ శాతం 12 నుండి 18 శాతం వరకు ఉన్న పత్తిని కూడా అనుపాత తగ్గింపులతో కొనుగోలు చేయాలని, వర్షానికి తడిసిన లేదా రంగు మారిన పత్తిని కూడా తగిన ధర తగ్గింపులతో కొనుగోలు చేయాలన్నారు. సహజ విపత్తుతో నష్టపోయిన రైతులను ఆదు కోవడంలో కేంద్రం తక్షణ సహకారం అందించాలని అచ్చెన్నాయుడు కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు.

## అటవీ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ప్రారంభం



**ఆమదాలవలస, నవంబరు 6(వార్త):** ఆమదాలవలస పట్టణంలోని కోటి సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజన సహకార సంస్థ సీతంపేట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సహజ సేంద్రీయ వ్యవసాయ, అటవీ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని శాసనసభ్యులు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ సహకారంతో గిరిజన ప్రాంతాల్లో ఉత్పత్తి అవుతున్న సహజ, సేంద్రీయ ఉత్పత్తులను పట్టణ ప్రజలకు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రం రైతులకు, గిరిజనులకు ఆదాయ వనరుగా, వినియోగదారులకు ఆరోగ్యవంతమైన ఆహార పదార్థాల వనరుగా మారుతుందని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సహకార సంస్థ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 10 నుంచి ధాన్యం కొనుగోలు

### విజయనగరం జాయింట్ కలెక్టర్ సేధుమాధవన్

**విజయనగరం,నవంబరు 6(వార్త):** జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ నెల 10 వ తేదీనుంచి ప్రారంభించనున్నామని జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ ప్రకటించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం రైస్ మిల్లర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో జెసి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలుకు క్షేత్రస్థాయిలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. కొనుగోలు ప్రక్రియలో మిల్లర్ల పాత్ర కూడా కీలకమని పేర్కొన్నారు. ఇప్పటికే సంతకవిటి, వంగర, తెర్లాం తదితర కొన్ని మండలాల్లో వరికోతలు ప్రారంభమయ్యాయని జెసి చెప్పారు. మరికొన్నిచోట్ల కొంచెం అలస్యం అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, కొనుగోలు కేంద్రాలను ముందుగానే సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

# పండుగను వైభవంగా నిర్వహించాలి

* ప్రజలకు ఎటువంటి ఆసౌకర్యాలు ఉండకూడదు
* శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
* అరసవల్లికి అనుసంధాన రోడ్ల పరిశీలన
* పారిశుధ్యం, తాగునీరు ఏర్పాటుకు అధికారులకు సూచనలు



**శ్రీకాకుళం, నవంబరు 6(వార్త):** అరసవల్లి పండుగను అత్యంత వైభవోపేతంగా సంతోషంగా నిర్వహించుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. అరసవల్లి పండుగలను పురస్కరించుకొని అసిరి తల్లి అమ్మవారిని దర్శనం చేసుకొని గురువారం అరసవల్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అరసవల్లికి అనుసంధానంగా ఉన్న రోడ్లను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే గ్రామంలో పాడైన రోడ్లకు సంబంధించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు వివరించారు. ముఖ్యంగా గ్రామంలో ఎక్కడా పారిశుద్ధ్యం లోపం లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు చెత్తను తొలగించడం, కాలువలను శుభ్రం చేయడం వంటి పనులు సకాలంలో చేయాలని తెలిపారు. అదే విధంగా తాగునీటికి ఇబ్బందులు లేకుండా ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. బయోటాయిలెట్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. అదే విధంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని రోడ్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ ఉండాలని, ముఖ్యంగా పార్కింగ్ స్థలాలపై దృష్టి సారించి పండుగలకు వచ్చే వారికి సూచనలు చేయాలని వివరించారు. పండుగకు జిల్లా వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీ దృష్ట్యా అన్ని శాఖల సిబ్బంది సమన్వయం చేసుకొని ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. పండుగ అనంతరం కూడా అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా పండుగ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలతో కలసి పర్యటించారు.

## స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలి



**శ్రీకాకుళం, నవంబరు 6(వార్త):** జిల్లాలో ప్రతి ఇంటా స్వదేశీ ఉద్యమం విస్తృతంగా సాగుతోంది. అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అంటించారు. ఆమదాలవలస రూరల్ మండల అధ్యక్షులు బెండి ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం పలు గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా పూర్వపు అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ స్వదేశీ వస్తువు లను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజల నుంచి మంచి ఆదరణ వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చింతాడ అప్పారావు, జిల్లా మాజీ కోశాధికారి చిగిలిపల్లి రాజేష్, సోషల్ మీడియా జిల్లా మాజీ కన్వీనర్ గురుగుబెల్లి రాజేష్, గురుగుబెల్లి నారా యణరావు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆమదాలవలస రూరల్ మండల అధ్యక్షులుగా ప్రసాద్



**ఆమదాలవలస, నవంబరు 6(వార్త):** బీజేపీ ఆమదాలవలస మండల అధ్యక్షులుగా బెండి శివాజీ ప్రసాద్ నియమితులయ్యారు. రాష్ట్ర పార్టీ సూచన మేరకు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ సూరపు నాయుడు నియామక పత్రాన్ని శివాజీ ప్రసాద్‌కు గురువారం అందజేశారు. నియామకమైన ప్రసాద్‌ను బీజేపీ నాయకులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శివాజీ ప్రసాద్ మాట్లాడుతూ ఆమదాలవలస మండలంలో పార్టీని బలోపేతం చేసేందుకు అందరి సహకారం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చింతాడ అప్పారావు, చిగిలిపల్లి రాజేష్, రామారావు పాల్గొన్నారు. ఆమదాలవలస రూరల్ మండల అధ్యక్షులుగా ఎంపికైన బెండి ప్రసాద్ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యవర్గ సభ్యులు చింతాడ అప్పారావు, పూర్వ జిల్లా కోశాధికారి చిగులపల్లి రాజేష్, పూర్వ జిల్లా సోషల్ మీడియా కోకన్వీనర్ గురుగుబిల్లి రాజశేఖర్, గురుగుబిల్లి నారా యణరావు ఉన్నారు.

## నియోజకవర్గ స్థాయి విజేతలు వీరే

**నరసన్నపేట, నవంబర్ 6(వార్త):** రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఇంటర్మీడి యట్ విద్యార్థులకు వివిధ స్థాయిల్లో పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ఉన్న ఐదు కళాశాలల నుంచి ముగ్గురేసి చొప్పున ఎంపిక చేసి 15 మందికి ఫైనల్ పోటీలు ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేటలో నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి ఆరుగురిని ఎంపిక చేసి వారికి మళ్లీ భారత స్వాతంత్ర్య పోరాటంపై క్విజ్ పెట్టామన్నారు. అంతిమంగా ముగ్గురు విజేతలను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు చెప్పారు. గదిలి మధుమిత, బొన్న రేణుక (జీజే కాలేజీ, నరసన్నపేట), పొంద్రంకి చాందిని (జీజే కాలేజీ, పోలాకి) లను జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేశామన్నారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) లో శుక్రవారం ఉదయం జరిగే పోటీలలో విజేతలు పాల్గొనాలని సూచించారు. న్యాయ నిర్ణేతలుగా ఎస్.సత్యనారాయణ, సీహెచ్ విశ్వప్రసాద్, డా. హెచ్.మల్లేశు, ఆర్.సోమశేఖర్ వ్యవహరించారు.

## 2047 విజన్ లక్ష్యాలపై సీఎం కీలక ఆదేశాలు

**శ్రీకాకుళం, నవంబరు 6(వార్త):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయం నుండి గురువారం మధ్యాహ్నం 'డేటా ఆధారిత పాలన అనే అంశంపై ఉన్నతస్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. సుపరిపాలన అందించే లక్ష్యంగా రూపొందించిన 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక ప్రణాళికలతో పనిచేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

## క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

* ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ విక్టర్‌పాల్
* పాలిటెక్నిక్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



**శ్రీకాకుళం, నవంబరు 6(వార్త):** క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ టి.విక్టర్‌పాల్ పిలుపునిచ్చారు. భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (బిహెచ్ఆర్‌సి) జ్యోత్స్న క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జెమ్స్ వైద్య కళాశాల, కిమ్స్ ఆసుపత్రుల సహకారంతో నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విక్టర్‌పాల్ మాట్లాడుతూ ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అప్రమత్తత అవసరమని, తమ కళాశాలలో బాలికలు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించిన జెమ్స్, కిమ్స్ వైద్య సంస్థలకు నిర్వహణకు సహకరించిన బిహెచ్ఆర్‌సి, జ్యోత్స్న క్యాన్సర్ ఫౌండేషన్‌ను అభినందించారు. భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (బిహెచ్ఆర్‌సి) నేషనల్ వైస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ప్రభు మాట్లాడుతూ మహిళలు, బాలికల్లో ఎక్కువగా క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తున్నందున వారి కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు కోసం జెమ్స్, కిమ్స్ సహకారం తీసుకోగలిగామన్నారు. బిహెచ్ఆర్‌సి ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ వైద్య పరీక్షల నిర్వహణకు మహిళలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, క్యాన్సర్ వ్యాధి సోకితే ప్రాణానికే ముప్పు వాటిల్లుతుందని, పరీక్షల నిర్వహణ ద్వారా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టవచ్చునన్నారు. బిహెచ్ఆర్‌సి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పి.మణిశర్మ మాట్లాడుతూ సృష్టికి ప్రతి సృష్టి మహిళే అని, అందువల్ల క్యాన్సర్ వ్యాధి పట్ల కూడా బాలికలు అవగాహన కల్పించుకొని ఆరోగ్య భద్రత కోసం ముందడుగు వేయాలన్నారు. ప్రోగ్రాం కో%-%ఆర్డినేటర్ ఎం.కీర్తి, బిహెచ్ఆర్‌సి మహిళా విభాగం జిల్లా ప్రెసిడెంట్ అంధవరపు జ్యోతిర్మయి, మహిళా పాలిటెక్నిక్ కళాశాల వివిధ విభాగాధిపతులు యమున, సంజయ్, సిబ్బంది భార్గవి, శివ, ప్రభ, రాజేశ్వరి, లలితకుమారి, అమిత, హోలీనాబేబీరాణి, వైద్యులు డాక్టర్ జి.లాస్య, డాక్టర్ శ్రీవల్లి, జెమ్స్, కిమ్స్ మార్కెటింగ్ జీఎం ప్రవీణ్, డీజీఎం విజయ్‌భాస్కర్, మార్కెటింగ్ మేనేజర్ రవిబాబు, పీఆర్‌వోలు పూర్ణ, తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐటీడీఏ పరిధిలో ప్రతి శుక్రవారం 'గిరిజన గ్రీవెన్స్ డే'

**పార్వతీపురం/సీతంపేట, నవంబరు 6(వార్త)::** షెడ్యూల్డ్ తెగలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంపై ఏజెన్సీ స్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం, ఈ దిశగా కీలక నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్ డా. ఎన్ ప్రభాకర రెడ్డి అన్నారు. గిరిజన పౌరుల సమస్యలను వేగంగా మరియు సమర్థవంతంగా పరిష్కరించడానికి ప్రతి శుక్రవారం రోజున రెండు ఐటీడీఏ పరిధిలో ప్రత్యేకంగా 'గిరిజన గ్రీవెన్స్ డే' నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి శుక్రవారం సంబంధిత ఐటీడీఏ ప్రధాన కార్యాలయంలో ఈ "గిరిజన గ్రీవెన్స్ డే" తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమం, రెవెన్యూ, గృహనిర్మాణం, విద్య, ఆరోగ్యం, ఇతర సంక్షేమ కార్యక్రమాలతో వ్యవహరించే సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. గిరిజన వ్యక్తులు, సంఘాల నుండి స్వీకరించిన ప్రతి పిటిషన్‌ను తప్పనిసరిగా నమోదు చేయడంతో పాటు, ఫిర్యాదుదారులకు తక్షణమే రసీదులు జారీ చేయాలని, స్వీకరించిన అన్ని ఫిర్యాదులపై కాలపరిమితిలోపు తదుపరి చర్యలు చేపట్టాలని, పరిష్కారాన్ని నిర్ధారించాన్నారు. ఈ ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయడం ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే కాకుండా, వారి హక్కులు, సంక్షేమ కార్యక్రమాల అమలులో సమ్మిళిత పాలనను బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ చొరవ గిరిజన సమాజంలో సానుకూల ప్రభావం చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాశీబుగ్గ ఘటనలు వంటివి జరగకుండా చూడాలి

* 11న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేక నిరసన ర్యాలీ * వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రతినిధి రేగాన, జిల్లా అధికార ప్రతినిధి సముద్రపు



**నెల్లిమర్ల,నవంబరు 6(వార్త):** కాశీబుగ్గ దేవాలయంలో జరిగిన సంఘటన పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాస రావు, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి సముద్రపు రామారావులు సూచించారు. నెల్లిమర్లలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బి.సిల మీద దాడులు పెరిగాయన్నారు. పాలన అధ్వాన్నంగా ఉంటే ఎల్లో మీడియా మాత్రం డబ్బా కొడుతోందని ధ్వజమెత్తారు. 4 గంటల్లో 40 వేల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని ఎల్లో మీడియా ప్రసారం చెయ్యడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అదెలా సాధ్యపడుతుందని వారు ప్రశ్నించారు. దేవాదాయ శాఖ ఆలయాల్లో జరిగిన ఘటనలకు సంబంధించి ఎవ రిపై చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. కాశీబుగ్గ ఆలయం ఘటన ప్రభుత్వం ఎందుకు ఆపలేకపోయిందన్నారు. అలాంటి సంఘటనలు జరగకుండా ఇప్పటికైనా సరియైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 11న నెల్లిమర్ల పట్టణంలో నియోజకవర్గ స్థాయి నిరసన ర్యాలీ ను శాంతియుతంగా నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసరావు, రామారావు తెలిపారు. నెల్లి మర్ల నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ శాసన సభ్యులు బడ్డుకొండ అప్పల నాయుడు ఆధ్వర్యంలో జరిగే నిరసన ర్యాలీ లో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, నియోజవర్గ పరిశీలకులు నెక్కలి నాయుడుబాబు పాల్గొంటారని పేర్కొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546